క్లుప్తంగా

బాలకృష్ణ శర్మకు జ్యోతిష్య బ్రహ్మ అవార్డు



బాలకృష్ణ శర్మకు జ్యోతిష్య బ్రహ్మ అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య అవధాని గుడిమెట్ల బాలకృష్ణ కిషోర్ శర్మకు జ్యోతిష్య బ్రహ్మ అవార్డు లభించింది. ఆర్యన్ జ్యోతిష్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఆర్యన్ జ్యోతిష్య పరిశోధన సంస్థ ఛైర్మన్ చిలక నరసింహ స్వామి, ప్రముఖ జ్యోతిష్య పరిశోధకుడు ఎస్. గోపీనాథ్, మంగళంపల్లి శేషారావు, పశుపాల అరుణ్ మహేష్ ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపిక, సర్టిఫికెట్ అందజేశారు.

క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం

ఏలూరు (టూటౌన్): క్రీడలు శారీరక ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కరరావు అన్నారు. స్థానిక సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీ గ్రౌండ్‌లో మూడు రోజులుగా ఎమ్మార్సీ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో సౌభాగ్యలక్ష్మీ నగర్ ఈశ్వర్ టీం, ఎంఆర్‌సీ కాలనీ సీనియర్ టీం మధ్య జరిగిన పోటీలో ఈశ్వర్ టీం విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన నడపన దాన భాస్కరరావు తన చేతుల మీదుగా విజేతలకు నగదు బహుమతి అందజేసారు. బీజేపీ నాయకులు మేకల శ్రీకృష్ణ దేవరాయలు, చేకూరి గణపతి, బొర్రా శివ, కెప్టెన్ హారి, క్రీడాకారులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

తాపీ పనివార్ల సంఘం అధ్యక్షుడిగా సోమరాజు



భీమడోలులో ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

భీమడోలు: భీమడోలు సంత మార్కెట్ వద్ద అమ్మవార్ల ఆలయం వద్ద ఆదివారం భీమడోలు తాపీ పనివార్ల సంక్షేమ సంఘం నూతన కార్యకర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా కేతినేటి సోమరాజు, సంయుక్త కార్యదర్శిగా షేక్ నాగూర్, కార్యదర్శిగా ఈత కోట తాతాజీ, కోశాధికారిగా ఈతకోట వీరరాఘవ, ఇతర సభ్యులను, గౌరవ అధ్యక్షుడిగా కోటి పల్లి సీతారామయ్యను ఎన్నుకున్నారు.

కూల్.. కూల్.. స్విమ్మింగ్ పూల్

- ఈ నెల 11 నుంచి స్వల్ప రుసుముతో పిల్లలు, పెద్దలకు శిక్షణ
- జలకాలాటలతో సేద తీరేందుకు అవకాశం



గతేడాది శిక్షణ పొందుతున్న చిన్నారులు (ఫైల్)



ఏలూరులో సిద్ధమైన స్విమ్మింగ్ పూల్

ఏలూరు రూరల్ : ఏలూరులో విశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్ పిల్లలు, పెద్దలకు వేసవి విడిదిగా మారనుంది. జిల్లా క్రీడాశాఖ అధికారులు స్విమ్మింగ్ పూల్ సిద్ధం చేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి సేద తీరేందుకు పిల్లలు, మహిళలకు అవకాశం కల్పించారు. ప్రత్యేక రుసుం, సమయం కేటాయించారు. రానున్న వేసవి సెలవుల్లో సైతం పిల్లలకు ప్రత్యేక శిక్షణ తరగతులు సైతం నిర్వహించనున్నామని ప్రకటించారు.

షెడ్యూల్ ప్రకటన

స్విమ్మింగ్ పూల్ నిర్వహణకు సంబంధించి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు సమయపాలన, ఫీజు నిర్ణయించారు. రోజుకు గంట చొప్పున ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ పిల్లలు, పెద్దలకు సమయం కేటాయించారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకూ ప్రత్యేకంగా మహిళలకు మాత్రమే అవకాశం కల్పించారు. ఈ సమయంలో పురుషులకు అనుమతి నిరాకరించారు.

ప్రత్యేక ఫీజులు

స్విమ్మింగ్ సాధన చేసేవారి కోసం అధికారులు ప్రత్యేక ఫీజులు నిర్ణయించారు. ఎనిమిది నుంచి 14 ఏళ్లలోపు వారికి అడ్మిషన్ ఫీజు రూ.1,000, నెల ఫీజు రూ.700 చెల్లించాలి. 15 ఏళ్ల నుంచి పెద్ద వయస్సు వారికి అడ్మిషన్ ఫీజు రూ.2,000, నెల ఫీజు రూ.1,200 చెల్లించాలి. కేవలం ఒక గంట పాటు స్విమ్మింగ్ చేయాలనే ఆసక్తి గలవారికి సైతం ప్రత్యేక రుసుం తీసుకుని అనుమతి ఇవ్వాలని క్రీడాశాఖాధికారులు నిర్ణయించారు.

జిమ్, బాత్, డ్రెసింగ్

స్విమ్మింగ్ పూల్ హాలులో అధికారులు జిమ్, బాత్ రూం సైతం అందుబాటులో ఉంచారు. మహిళలు, పురుషులు స్విమ్మింగ్ చేయడానికి ముందు జిమ్‌లో కొంత సమయం సాధన చేయవచ్చు. బాత్‌రూం సైతం ఉపయోగించుకున్న తర్వాత పూల్‌లో సేద తీరవచ్చు.

ద్రావకాలతో నీటి శుద్ధి

అధికారులు స్విమ్మింగ్ పూల్‌లో నీటిని ఎప్పటికప్పుడు శుద్ధి చేస్తున్నారు. ప్రత్యేక ద్రావకాలు కలిపి నీటిలో క్రిమి కీటకాలను నివారిస్తున్నారు. పూల్ అడుగు భాగంలో నాచు, మట్టి, చేరకుండా శుభ్రం చేస్తున్నారు. క్రమం తప్పకుండా నీటిని మార్చుతూ స్విమ్మింగ్‌పూల్ శుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

చిన్నారులకు ప్రత్యేక శిక్షణ



వేసవి సెలవుల్లో పిల్లల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నాం. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం నెలరోజుల పాటు శిక్షణ అందిస్తాం. శిక్షణ పూర్తి చేసిన చిన్నారులకు ముగింపురోజున పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తాం. గతంలో ఇక్కడ శిక్షణ పొందిన చిన్నారులు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. –గణేష్, కోచ్

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గట్టిం మాణిక్యాలరావు

ఏలూరు (టూటౌన్): వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో న్యాయవాది బీవీ కృష్ణారెడ్డి 25 ఏళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. స్థానిక నరసింహారావుపేట ఓవర్ బ్రిడ్జి పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు పెరుగుతున్నాయని స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పాదచారులకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కేబీ రావు, కార్యదర్శి బీవీవీ సత్యనారాయణ, ట్రెజరర్ డి.రమాదేవి, బి.పద్మజావాణి, డాక్టర్ సుబ్బారావు, ఎల్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రామకోటిలో భగవద్గీత పారాయణ



భగవద్గీత పారాయణం చేస్తున్న మహిళలు



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న బీకే బిందు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 92వ శ్రీ రామకోటి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులతో మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఉదయం 9 గంటలకు విశేష తులసీదళ పూజలు నిర్వహించారు. అనంతరం 10 గంటలకు దొండపాడు దత్తనాథ క్షేత్రం బృందం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో 18 అధ్యాయాల భగవద్గీత పారాయణం చేశారు. సాయంత్రం 6 గంటలకు నగరానికి చెందిన ఎస్‌పీస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రిన్స్‌పాల్ ఎస్‌పీఎస్ వాసు శిష్యులు అన్నమయ్య సంకీర్తనాలాపన కార్యక్రమం నిర్వహించారు. పలువురు గాయనకులు అన్నమాచార్య కీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు. శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ప్రతి హామీనీ నెరవేర్చాం

పెదవేగి : మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని పవిత్రంగా భావించి తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం ముండూరు గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ ఏరియాలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. లో ఓల్టేజి సమస్య పరిష్కరించడం కోసం బ్రాహ్మణవారి వీధిలో 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ పి శ్రీనివాస్, ఏఈ కె నాగేశు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వెంగంపాలెంలో పాదయాత్ర

ముండూరు పంచాయతీ పరిధిలోని వెంగంపాలెంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వెంగంపాలెంలో నూతన బోరు పనులకు, షెడ్డు పనులకు అబ్బయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు నెరుసు నాగసత్యం, ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు





నేడు దెందులూరులో వైఎస్సార్ చేయూత సభ

దెందులూరు: దెందులూరు ఇంద్రవనంలో సోమవారం వైఎస్సార్ చేయూత పథకాన్ని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం ఇంద్రవనంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రారంభించనున్న వైఎస్సార్ చేయూత పథకం ప్రారంభించనున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం నాని మాట్లాడుతూ దెందులూరు మండలం నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారన్నారు. ఇటీవల రూ.70 లక్షలతో నిర్మించిన కోఆపరేటివ్ బ్యాంకు నుంచి జగనన్న కాలనీ వరకు రోడ్డును ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రారంభోత్సవం చేస్తారన్నారు.

విలువలు, సిద్ధాంతాల్లేని వ్యక్తి చంద్రబాబు



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

ఏలూరు (టూటౌన్): విలువలు, సిద్ధాంతాల్లేని వ్యక్తి చంద్రబాబు అని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని సంఘ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. విలువల్లేవు కాబట్టే చంద్రబాబు బీజేపీ నేతలను, ప్రధాని మోదీని, అమిత్‌షాను గతంలో దూషించి నేడు వారితోనే పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. చంద్రబాబు స్వార్థపరుడని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల అధికారంలో ఉండి ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా మోసం చేశాడన్నా. తిరపతి సభకు అమిత్‌షా వస్తే ఆయనపై కోడిగుడ్లు వేయించిన ఘనుడు చంద్రబాబు అని అన్నారు. సీఎం వైఎస్ జగన్ ఐదేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి నేను ఎన్నికలకు సిద్ధం అంటుంటే చంద్రబాబు మాత్రం 14 ఏళ్ల ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చకుండా రా కదిలిరా అంటుంటే ఆ సభలకు జనం మాత్రం మొఖం చాటేస్తున్నారన్నారు. భీమిలి, దెందులూరు, రాప్తాడుతో పాటు ఆదివారం బాపట్లలో నిర్వహించిన సిద్ధం సభలకు జనం పోటెత్తారని దీన్ని చూసి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక చంద్రబాబు పొత్తులు పెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు బి.సునీల్ బాబు, పి.బాలకృష్ణ, పి.పెద్దిరాజు, బి.రోహిత్ రాజ్, ప్రియదర్శిని రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	02
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	17
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	07
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

చెరువుల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



స్థానిక సుంకరవారి తోటలో మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వాలు రజకులకు జీవోల ప్రకారం, పూర్తి హక్కులతో కేటాయించిన చెరువులను ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక సుంకరవారి తోట సమీపంలో రజకుల చెరువ గట్లపై చెట్లను కొంతమంది నరికి వేయడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. చెట్లను అక్రమంగా నరికి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక చెరువు గట్లను కట్లయ్య స్థానికులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ 1903లో నాటి బ్రిటీష్ ప్రభుత్వం రజకులకు అధికారికంగా ఈ చెరువును కేటాయించారని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మున్సిపాల్టీలు, పంచాయతీల పరిధిలో ఆక్రమణలకు గురవుతున్న రజకుల చెరువులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. రజక సంఘం నాయకులు జుజ్జువరపు శ్రీనివాసరావు, వీరాస్వామి, చల్లగురుకుల గిరిరాజు, సురుగుల మురళి మాట్లాడారు. ఈ సమావేశంలో రజక సంఘం సీనియర్ నాయకులు ఏ.అన్నవరం, పొన్నాటి పార్వతి, దువ్వాపు సత్యనారాయణ, పొన్నాటి రాజు, జిల్లా రజక నేతలు విఠాల శ్రీనివాస్, కొమ్మంటి మురళి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	52
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	30	కంద	68
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	40
కాకర కాయలు	34-40	కీరా దోస	48
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	84
కాలీఫ్లవర్	30	అల్లం	120
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	40-44	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	24-28	గోంగూర	08
గోరుచిక్కుడు	38	పుదీనా	05
దోసకాయలు	24	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

మహిళాభ్యున్నతి కోసం సావిత్రిబాయి పూలే కృషి



సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మెండెం సంతోష్ కుమార్ తదితరులు

ఏలూరు(మెట్రో): చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జెడ్పీ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే పెళ్లి అయిన తరువాత చదువుకొని భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సేవలందించారని అన్నారు. 1848లో ఫాతిమా షేక్ అనే మహిళతో కలిసి మొట్టమొదట బాలికలకు పాఠశాల ప్రారంభించారని తెలిపారు. తన జీవితాన్ని త్యాగం చేసి మహిళల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని ఆడపిల్లల జీవితాలను తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమం వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, నాయకులు పామర్తి అచ్యుత్ గౌడ్, లక్కోజు గోపి పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆమెకు వివిధ సంఘాల నాయకులు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల వద్ద ఏపీ బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పామర్తి యేసురాజు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు టౌన్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.కన్నబాబు, మట్టా నాగేందర్, ఎంవీ సుబ్బారావు, వివిధ బీసీ సంఘాల నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు. స్థానిక నరసింహారావుపేటలోని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొరబండి బాబూరావు, బి.నాగరాజు, గారపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

